

www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025
5
తిరుపతి



మాక్ అసెంబ్లీలో అదరగొట్టిన మహిజ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో బోనుపల్లి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని సామా మహిజ అదరగొట్టింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పాత్ర పోషించిన ఆమె తనదైన శైలిలో ప్రజాసమస్యలపై తన గళాన్ని వినిపించి శభాష్ అనిపించుకున్నారు. సభికులనుంచి ప్రశంసలు అందుకుంది. మాక్ అసెంబ్లీ అనంతరం ఐటీ మంత్రి నారా లోకేష్ మహిజను ప్రత్యేకంగా అభినందించారు.



మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలి

వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్



వెంకటగిరి ఆస్పత్రి వద్ద బాధితులతో సిఐటియు ధర్నా

శ్రీకాళహస్తి రూరల్ మన్నవరం వద్ద వెల్లంపాడు సమీపంలోని సుధా సోమెనీ సిరామిక్ టైల్స్ పరిశ్రమలో బుధవారం గ్యాస్ ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు 25 లక్షలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చేమూరు గురవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి వెంకటగిరి ప్రభుత్వాసుపత్రి ముందు గురువారం ధర్నా నిర్వహించారు. టైల్స్ పరిశ్రమలో 450 మంది కార్మికులు పనిచేస్తున్నారని, పరిశ్రమలో భూమిలోపల పూడ్చిన ట్యాంకర్ పేలడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. సుధా సోమెనీ సిరామిక్ టైల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పేలుడు ఘటన జరిగిందన్నారు. గుండిపాటు పోతురాజు, పాండేల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతో పాటు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువయ్యిందన్నారు. తనిఖీలు నిర్వహించాల్సిన అధికార యంత్రాంగం నిద్రపోతుందన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్



హఠాత్తుగా ప్రమాదాలు జరిగినప్పుడు అక్కడ ఉన్న వారిని ప్రాణాలతో కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గూడూరు మండలం తుంగపాలెంలో ఉన్న కలర్ ఫైన్ ఫ్యాక్టరీలో ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కల్పించారు. గూడూరు మండల పరిధిలోని తుంగపాలెంలో ఉన్న కలర్ ఫైన్ ఫ్యాక్టరీలో ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై కార్మికులకు మాక్ డ్రిల్ నిర్వహించారు . లిక్విడ్ హై లిక్విడ్ ప్రమాదాలు జరిగినప్పుడు ఏమి చేయాలో తెలియజేశారు. అనంతరం డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో హఠాత్తుగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఆ పరిస్థితుల్లో కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించామన్నారు. అలాగే పరిశ్రమలో కొన్ని మార్పులు చేయాలని సూచించామని వెల్లడించారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా అవగాహన కల్పించామన్నారు.



అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్ష

శెట్టిపల్లి లబ్ధిదారులకు ప్లాట్లు త్వరితగతిన ఇవ్వాలి : కలెక్టర్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లును కేటాయింపు, పంపిణీ పక్రియ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనుల పై ఇన్ఛార్జి జాయింట్ కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దివాకర్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ.. శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులను పూర్తి చేసి అర్హులైన వారికి ప్లాట్లు కేటాయించాలని తెలిపారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడానికి సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. శెట్టిపల్లిలో ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన లేఔట్ నిర్మాణం జరుగుతుందనీ, అందులో రోడ్లు, డ్రైనేజ్, తాగు నీటి పైపులు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లే అవుట్ డెవలప్మెంట్ పనులను సంబందిత అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేస్తూ జంగిల్ క్లియరెన్స్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్‌డిఓ రాంమోహన్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, సూర్యనారాయణమ్మ, తుడా ఈఈ రవీంద్రనాథ్, ఎస్ఈ కష్ణారెడ్డి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ సాధనకు సహకరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



టిటిడి ఛైర్మన్‌తో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి

'బాలాజీ రైల్వే డివిజన్ సాధనకు సహకరించండి' అంటూ సాధన సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా గురువారం పలువురిని కలిసారు. తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలవగా సిఎం చంద్రబాబుకు డివిజన్ ఆవశ్యకతపై నివేదిక పంపిస్తానని చెప్పారు. కమిషనర్ మౌర్యను కలవగా తదుపరి కౌన్సిల్ సమావేశంలో అజెండా పెట్టి ప్రజల దృష్టికి తీసుకొచ్చి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డిని, మేయర్ డాక్టర్ బిఆర్ శిరీషను కలిసారు. తిరుపతిని రైల్వే డివిజన్ చేయడం ద్వారా మంచి ఆస్పత్రి, స్కూల్స్, ప్లేగ్రౌండ్ లాంటి మరెన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ఎందరికో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డిని కలవగా సిఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మను కలిసారు. పలువురిని కలిసిన వారిలో సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్, ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రెసిడెంట్ వైఎస్ బాబు, సూరినేని బుజ్జిబాబునాయుడు, చింతకాయల కృష్ణయ్య, అనిల్‌కుమార్, నీలేష్, కుమార్, రాజు, నాగరాజు, టివిరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు సమీక్షించిన ఎంపీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో రూ.50 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గురువారం పరిశీలించారు. స్టేషన్‌లో మొదటి దశలో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన తనిఖీ చేశారు. పాత ఎల్‌సీ గేట్ నెం. 28 వద్ద అండర్‌పాస్ మూసివేయడంతో అక్కడ అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, వారి అభ్యర్థనను రైల్వే అధికారుల దష్టికి తీసుకెళ్లి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. స్టేషన్‌లో తాగునీటి వసతి, సైన్‌బోర్డులు, ఇతర మౌలిక వసతులపై ఎంపీ ప్రత్యేకంగా ఆరాతీశారు. తాగునీరు సక్రమంగా అందుబాటులో ఉండేలా చూడాలని, స్టేషన్‌లో సైన్‌బోర్డులు సరిగా లేవని గమనించి వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆలయ ఈఓతో మాట్లాడిన ఎంపీ, రైల్వే స్టేషన్‌లో ఉన్న సమాచార కేంద్రంలో భక్తులకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆలయ సేవలకు సంబంధించిన వివరాలను రైల్వే స్టేషన్ ఆవరణలో ఒక డిజిటల్ బోర్డు ద్వారా ప్రదర్శించేలా వెంటనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో నిలిపేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ మొదటి దశ అభివృద్ధి పనులు మే 26 నాటికి పూర్తికానున్నాయని స్టేషన్ మాస్టర్ ఈ సందర్భంగా ఎంపీకి తెలిపారు.

దోపిడీ దొంగల స్వైర విహారం

- శ్రీకాళహస్తిలో వృద్ధ దంపతులపై దాడి
- భార్య మృతి, అపస్మారక స్థితిలోకి భర్త
- తెల్లవారుజామున దోపిడీకి యత్నం
- ఇటు పుత్తూరులో వరుస చోరీలు
- ఇళ్లు, గుళ్లు, అంగళ్లు.. కావేవీ దోపిడీకనర్హం
- నిఘా పెంచాలని స్థానికుల డిమాండ్



జిల్లా వ్యాప్తంగా దోపిడీలతో జనం బెబేలెత్తిపోతున్నారు. శివారు ప్రాంతాల నివాసితులకు రక్షణ కరువవుతోందని, దుండగులు దాడులకు తెగబడుతూ.. ప్రజల ధన, ప్రాణాలకు హాని కలిగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి శివారు ప్రాంతంలో నివసిస్తున్న వృద్ధ దంపతులపై తెల్లవారు జామున దాడి చేసిన ఘటనలో వృద్ధురాలు మృతి చెందగా, వృద్ధుడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఇటు పుత్తూరులో వరుస చోరీలతో నగర వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇళ్లు, గుళ్లు, బళ్లు, అంగళ్లు కావేవీ దోపిడీకనర్హం అన్న రీతిలో దుండగులు రెచ్చిపోతున్నారు. పోలీసు నిఘా వ్యవస్థపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధ దంపతులపై అగంతకుడి కత్తి దాడి

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు
- ఆక్స్ ఫర్డ్ అధినేత ఇంట్లో విషాదం



మృతి చెందిన జయమ్మ / ఫైల్ ఫోటో / చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆక్స్ ఫర్డ్ విద్యా సంస్థల అధినేత, వైసీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులపై గుర్తు తెలియని అగంతకుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో మధుసూధన్ రెడ్డి తల్లి జయమ్మ (70) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తండ్రి మహాదేవరెడ్డి(81) తీవ్రంగా గాయపడ్డారు. సంచలనం సృష్టించిన ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పుల్లారెడ్డి కండ్రిగ వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన ఓ విలాసవంతమైన ఇంటిలో మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఓ అగంతకుడు గ్యాస్ కట్టర్ సాయంతో స్టోర్ రూమ్ నుంచి వంట గదిలోకి ప్రవేశించాడు. బెడ్రూమ్‌లో గాఢ నిద్రలో ఉన్న జయమ్మ, మహాదేవరెడ్డి దంపతులపై కత్తితో దాడి చేశాడు. మహాదేవరెడ్డి దుండగుడి దాడితో కింద పడి అపస్మారకస్థితికి చేరుకోగా, జయమ్మ ప్రతిఘటించింది. దీంతో దుండగుడు ఆమెను హత మార్చాడు. ఆమె చెవికి ఉన్న కమ్మలు, బంగారు గాజులు లాక్కొని వెళ్ళాడు. గురువారం ఉదయం ఇంటి వద్దకు వచ్చిన పనిమనిషి ఎంత కొట్టినా జయమ్మ దంపతులు తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు లోపలకొచ్చి చూడగా రక్తపు మడుగులో ఉన్న జయమ్మ దంపతులను చూసి నిర్ఘాంతపోయారు. జయమ్మ మృతిచెందిదన్న నిర్ధారించుకున్న బంధువులు మహాదేవరెడ్డిని చికిత్స నిమిత్తం హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు సైతం ఘటన జరిగిన ఇంటితోపాటు సమీప ప్రాంతాల్లో ఆధారాల కోసం ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే వృద్ధ దంపతులపై దాడికి దారి తీసిన కారణాలేవి పోలీసులు వెల్లడించలేదు. దాడి చోరీ కోసం జరిగిందా..! లేక పాత కక్షలు, రాజకీయ నేపథ్యంలో జరిగిందా..! అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అయితే మధుసూదన్ రెడ్డి బంధువులు చెప్తున్న వివరాలు ప్రకారం ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులపై దాడి చేసి నగలు, డబ్బు దోచుకోవాలని ఉద్దేశంతోనే స్థానికంగా ఉంటున్న కొందరు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమానం ఉన్న పలువురు పేర్లను కూడా వారు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. విచారణ వేగవంతం చేసి, త్వరలోనే నిందితుల్ని పట్టుకుంటామని తిరుపతి అదనపు ఎస్పీ రవి మనోహరాచారి మీడియాకు వెల్లడించారు.

వరుస చోరీలతో పుత్తురు వాసులు బెంబేలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్ట ణంలో వరుస దొంగ తనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు ."ఇంట్లో ఎవరూ లేరంటే చాలు ఇష్టం వచ్చినట్టు దోచేయ్" అన్నట్లుగా నేరస్థులు రాత్రి వేళ స్వైర విహా రం చేస్తున్నారు. సెప్టెంబర్ 15న ఆచారి వీధిలో 30 లక్షల విలువైన బంగారం దొంగ తనం జరిగిన సంఘ టనతో మొదలైన దొంగలదందా, అక్టోబర్‌లో ఆర్టీసీ దుకాణాల వద్ద ఉన్న టెక్నో డీలర్ షాపు దొంగతనం వరకు కొనసాగింది. తాజాగా ఆరేటమ్మ కాలనీ, గేట్ పుత్తూరు ప్రాంతాల్లోనూ దొంగలు ఇళ్లు ఖాళీగా ఉన్న సమ యాలను ఎంచుకుని దాడులు చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఆరేటమ్మ కాలనీలో శివరామకృష్ణ ప్రసాద్ ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న దొంగలు తాళాలు పగులగొట్టి ఇంటిని చిందరవందర చేశారు. అల్మారాలు, బీరవాళ్లు పగలగొట్టి నగదు, 1 కెజీ వెండి సామాన్లు, 15 సవరాలు బంగారు, 50వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లి నట్టు తెలిసింది. గత వారంలో పుత్తూరు పట్టణం స్వామి వీధిలోని వినాయకాలయంలో హుండీ పగులగొట్టి రూ.30 వేల నగదు, వెండి సామగ్రి దొంగలు అపహరించారు. రాత్రి బయటికి వెళ్ళినా భయం, ఇంట్లో ఉన్నా భయం. చిన్న పిల్లలు కూడా కిటికీ శబ్దం వచ్చినా భయంతో లేస్తున్నారుని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు, గుళ్లు, అంగళ్లు ఏదీ వదలకుండా దొంగలు పోలీసులకు సవాలుగా విసురుతున్నారు. పట్టణంలో రాత్రి పహారా పెంచి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, దొంగలకు చెక్ పెట్టాలని ప్రజలు పోలీసు విభాగాన్ని కోరుతున్నారు.



పుత్తూరులో ఇంట్లో వస్తువులు చిందర వందర చేసిన దొంగలు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడంలో ప్రభుత్వానికి ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నవారు సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పి4ను అమలు చేస్తోందని చెప్పారు. కచ్చపి ఆడిటోరియంలో గురువారం స్వర్ణాంధ్ర 2047 నియోజకవర్గ స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన జరిగింది. ఇరవై శాతంగా ఉన్న పేదలను పది శాతం సంపన్నులు ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతిలో 7,455 మంది బంగారు కుటుంబాలు ఉంటే ఇప్పటి వరకు 6,411 మందిని మార్గదర్శకులుతో అధికారులు మ్యాపింగ్ చేశారని తెలిపారు. ఇందులో మెడికల్ ట్రీట్మెంట్ కోరుకున్న వారే ఎక్కువగా ఉన్నారని, వారిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన 1044 మందిని త్వరలోనే మ్యాపింగ్ చేయించి ఆదుకుంటామని తెలిపారు. కొంతమంది మార్గదర్శులు వార్డులను కూడా దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని వారిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సమావేశం అనంతరం కమిషనర్ దత్తత తీసుకున్న ఐదు కుటుంబాల్లో ఒకరికి తోపుడు బండిని అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

టిటిడి కాంట్రాక్టు కార్మికులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైకుంఠ ఏకాదశికి టీటీడీలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఎఫ్ఎంఎస్, హెల్త్, కళ్యాణకట్ట, అన్నదానం, వాటర్ వర్క్స్, గార్డెన్, ఎలక్ట్రికల్, లగేజ్ కౌంటర్, సొసైటీ ద్వారా పనిచేస్తున్న వారికి, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వారికి, ఇతర విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ వైకుంఠ ఏకాదశికి శ్రీవారి దర్శనం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజు వచ్చే భక్తులకు సేవలందించడంలో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కీలకమైనదని, సేవలందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ శ్రీవారి దర్శనం కల్పించాలని కోరారు. స్థానికులకు జనవరి 6, 7, 8 తేదీలలో వైకుంఠం ద్వారా దర్శన సౌకర్యం కల్పించడం మంచిదేనని అన్నారు. టిటిడిఉద్యోగులకు దర్శన సౌకర్యం కల్పించడానికి విధి విధానాలు రూపొందించిన విధంగా, టిటిడి కాంట్రాక్ట్ కార్మికులందరికీ దర్శన సౌకర్యం కల్పించడానికి విధివిధానాలు రూపొందించాలని టిటిడికి విజ్ఞప్తి చేశారు.

ఆలయ ఈఈ సుబ్రమణ్యం అరెస్ట్



ప్రజాశక్తి -తిరుమల

తిరుమల కల్తీ నెయ్యి కేసులో విచారణ కొనసాగుతున్న సమయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరొకరు అరెస్ట్ అయ్యారు. గతంలో టీటీడీ మార్కెటింగ్ జీఎం గా, ప్రస్తుత ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. సుబ్రమణ్యం అరెస్ట్‌తో ఈ కేసులో అరెస్ట్‌ల సంఖ్య మొత్తం 10కి చేరింది. వైసీపీ హయాంలో తిరుమలలో లడ్డూ తయారీలో కల్తీకి పాల్పడ్డారన్న ఆరోపణలు తలెత్తిన విషయం అందరికీ తెలిసిందే. 2019 - 2024 మధ్య 20.01 కోట్ల వేంకటేశ్వరస్వామి లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సిట్ విచారణలో తేలింది. మొత్తం 48.76 కోట్ల లడ్డూలను తయారు చేయగా.. ఆ లడ్డూల్లో 40 శాతం పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్‌తో పాటూ ఇతర రసాయనాలతో తయారు చేశారని నిర్ధారణ అయింది. టీటీడీలోని అప్పటి ధర్మకర్తల మండలి నెయ్యి సరఫరా కోసం.. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ, తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పునబాకలోని వైష్ణవి డెయిరీతో పాటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాల్‌గంగ డెయిరీలకు రూ.250 కోట్లు చెల్లించింది. ఈ డెయిరీల నుంచి మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేశారు. అయితే ఇందులో 68 లక్షల కిలోలు కల్తీ నెయ్యి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో రోజూ సుమారు 4 లక్షల లడ్డూలు తయారు చేస్తుంటారు. దీనికోసం 12 నుంచి 13 వేల కిలోల నెయ్యిని వాడాల్సి వస్తుంటుంది. కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారులు ఇటీవల టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని వైవీ సుబ్బారెడ్డి నివాసంలో అధికారులు విచారణ చేశారు. అలాగే ఈ కేసులో ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.



చెవిరెడ్డికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అగంతకుడి దాడిలో తల్లిని కోల్పోయిన వైసీపీ మండల అధ్యక్షులు, ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల అధినేత చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డిని గురువారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధుసూదన్ రెడ్డి తండ్రి మహదేవరెడ్డిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఘాతుకానికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మధుసూదన్ రెడ్డిని పరామర్శించారు.

తిరుమలలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -తిరుమల



తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆర్బీ సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. పదునైన చాకుతో గొంతు, పొట్ట భాగాన్ని కోసుకున్నాడు. అంతేకాకుండా పొట్ట పేగుల్ని బయటకు తీసేశాడు. అతను మానసిక రోగి అని అనుమానిస్తున్నారు. కుడి చేతిపై సిలువ ఉన్న పచ్చబొట్టు ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని మొదట అశ్విని ఆసుపత్రికి, అనంతరం తిరుపతి సిమ్స్‌కు తరలించారు.

బాల్య వివాహాలు లేని భారత్ కావాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని చూడడమే మన లక్ష్యం కావాలని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ జయరామారావు హాలులో గురువారం బాల్ వివాహ్ ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్, ప్రగతి సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండలాల నుంచి గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మత పెద్దలు, అధికారులు హాజరయ్యారు. వందరోజుల కార్యక్రమంలో బాల్య వివాహాలను సమూలంగా నివారించేందుకవసరమైన కార్యచరణతో ముందుకెళ్లాలని సూచించారు. సిడిపిఓ శాంతి దుర్గ, ప్రగతి సంస్థ సమన్వయకర్త రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల డెయిరీ పాల ఉత్పత్తుల షాప్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ.

టీటీడీ పరిపాలన భవనం సమీపంలోని భవాని నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల డైరీ పాల ఉత్పత్తులు సంబంధించిన షాపును నిర్వాహకులు హేమంత్ కాకర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి శ్రీవారి పాదాలు చెంత నాణ్యమైన, మన్నికైన, పాల ఉత్పత్తులు అందరికీ అందుబాటులో, సరసమైన ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్లర్ సంబంధించి అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9000511876 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని సూచించారు.



విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం తిరుపతి, తుడా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బి.ఎన్.కండ్రిగ మండలం, కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఇషాంత్‌కు జాయింట్ కలెక్టర్ మౌర్య ఆధ్వర్యంలో డీఈవో కెవిఎన్ కుమార్ మెడల్, ప్రశంసా పత్రం అందించారు. రాజ్యాంగ దినోత్సవంపై నవంబర్ ఒకటో తేదీన జరిగిన నియోజవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో కల్లివెట్టు విద్యార్థి ఇషాంత్ తృతీయ స్థానాన్ని సాధించినందుకు ప్రశంసించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి విద్యార్థికి భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, దాసు, జగన్నాధం, మాధవీలత, సుజన, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి, వినోద్, రత్నకుమారి హరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలం బలిజ సంఘం అధ్యక్షుడు కన్నివేలు రాయల్‌కు రోడ్డు ప్రమాదంలో కాలికి బలమైన గాయాలవడంతో పుత్తూరు అన్నా గౌరీ హాస్పిటల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆయనను గురువారం బలిజ సంఘం సీనియర్ నాయకుడు, జాతీయ కాపు సంఘం గోపి రాయల్, జాతీయ ప్రచార కార్యదర్శి బాలాజీ రాయల్‌లు పరామర్శించారు.

అనర్హుల హంగామాపై ఎమ్మెల్యే అసహనం

ప్రజాశక్తి - నాగలాపురం: ఎలాంటి పదవిలేని వారికి కొంతమంది అధికారులు హంగామాగా ఆర్భాటాలు చేసి వారికి తోడుగా పోలీసులు ఎస్కార్ట్ వెళ్లడం ఎంతవరకు సమంజసమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం నాగలాపురం మండలం, నాగలాపురం పంచాయతీ పరిధి, ద్వారకా నగర్‌లో సుమారు 9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెనకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ నేను రాజ్యాంగబద్ధం గా ప్రజల చేత ఓట్లు వేసి ఎన్నుకోబడిన ఎమ్మెల్యే అని నేనెప్పుడూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ వస్తున్నాను కానీ శంకర్ రెడ్డి ఎలాంటి పదవులు లేకుండా హంగామా, ఆర్భాటాలు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ హోదాలో అతనికి పోలీసులు ఎస్కార్ట్ వెళ్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ప్రశ్నించడం జరిగి అనంతరం పదవిలేని వాడికి ఎస్కార్టు పదవి ఉన్నవారికి ఎస్కార్టు ఎలా అని ఎస్ పి ని అడిగి అలాంటి ఎస్కార్ట్ నాకు అవసరం లేదు నేను ప్రజల మనిషిని నాకు ప్రజల సహాయ సహకారాలు ఉంది నాకు పోలీసులు ఎస్కార్ట్ అవసరం లేదని చెప్పడం జరిగిందని ఆయన అన్నారు భారత రాజ్యాంగంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని కూడా ఆయన ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో అధికారులు , కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా మీకోసం..

ప్రజాశక్తి - రామచంద్రాపురం: అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి కూటమి ప్రభుత్వం రైతన్నల జీవితాలలో వెలుగులు నింపుతున్నదిని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. గురువారం మండలంలోని కట్టకింద వెంకటాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా అన్నదాత సుఖీభవపై ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం నిధులు రెండు విడతలుగా రూ. 14 వేల రూపాయలు ప్రభుత్వం బ్యాంకు ఖాతాలకు జమ చేసిందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో శివరామ్ సింగ్, నాయకులు ఉమాపతి నాయుడు, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, నరసింహారెడ్డి, ముని మోహన్ మురళి నాయుడు, రాఘవేంద్ర నాయుడు, కే ముద్దు కృష్ణారెడ్డి , ప్రభాకర్ రెడ్డి, శ్రావణ్ చౌదరి, బాలాజీ నాయుడు, గోపి చౌదరి, గిరి నాయుడు, నీలకంఠ చౌదరి, జనార్దన్ నాయుడు మహిళలు, రైతులు, కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోడూరు మీరా రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు ప్రజా సమితి నాయకులు కోడూరు మీరా రెడ్డి కోరారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని మీరా రెడ్డి నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళల ముఖా ముఖి కార్యక్రమంలో గూడూరు ను నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, ఆ హామీని ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. అదేవిధంగా మంత్రి నారా లోకేష్ యువగళం పాద యాత్రలో గూడూరును నెల్లూరు జిల్లా లో కలుపుతామని హామీ ఇచ్చారని, ఆ హామీని మరిచి ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. ఇకనైనా గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేదా నెల్లూరు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని కూడా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డి, మహేంద్ర, చంద్రయ్య, రాఘవ రెడ్డి, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూపతి మృతి టీడీపీకి తీరని లోటు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలుగుదేశం పార్టీ యువనాయకుడు, రాష్ట్ర వన్నీకుల క్షత్రీయ కార్పొరేషన్ డైరెక్టర్ వి.భూపతి విద్యుత్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కుడు కుప్పం షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. గురువారం వారి స్వగ్రామంలో శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, కుప్పం ఇంచార్జ్ పీ.ఎస్ మునిరత్నంలతో కలిసి భూపతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పి.కె.ఎం ఉడా ఛైర్మెన్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్ జి.ఎమ్ రాజు రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ జయ్ జిల్లా బీసీ కార్యదర్శి లక్ష్మీపతి పుత్తూరు పట్టణ టి.ఎన్ ఎస్.ఎఫ్ అధ్యక్షులు అడుసుమల్లి నవీన్, కలియబాకం ఆయకట్టు చైర్మన్ రమేష్ నాయుడుతదితరులు పాల్గొన్నారు.

రేపు ఆటల పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఈనెల 29 న ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయునులకు త్రో బాల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పత్రిక ప్రకటనలో గూడూరు మండల విద్యాశాఖాధికారులు రవీంద్ర బాబు, కాంచన, కోఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా నెలవల జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - నాయుడుపేట: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త నియోజకవర్గంలోని సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎంపీ నెలవుల సుబ్రహ్మణ్యం ఆయన జన్మదిన వేడుకలకు విచ్చేసిన టిడిపి నాయకులను కార్యకర్తలు కోరారు. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను గురువారం ఆయన నివాసంలో పార్టీ నాయకులు, అధికారులు, టిడిపి కార్యకర్తలు, ఆయన అభిమానుల ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన నాయకులు మాట్లాడుతూ నెలవల సుబ్రహ్మణ్యం, ఆయన కుమార్తె సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాలనలో నియోజకవర్గం కొత్త రూపులు దిద్దుకుంటుందని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు నిత్యం ఆయురారోగ్యాలతో ఉంటూ మమ్మల్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలకు హాజరైన నాయకులు అధికారులు కార్యకర్తలు అభిమానులు నెలవల సుబ్రహ్మణ్యం అమృత సరళ దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి వేడుకలకు విచ్చేసిన వారికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ వైస్ చైర్మన్ ఎస్కె రఫీ, సులూరుపేట నియోజకవర్గ జనసేన అధ్యక్షులు మరియు నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల.ప్రవీణ్,నాయుడుపేట గ్రామదేవత శ్రీశ్రీ పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానాబాల సుబ్బారావు, టిడిపి నాయకులు కట్ట.వెంకటరమణారెడ్డి, మైలారి.రాజశేఖర్,నాగిరెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి,కాపులూరు.చక్రపాణి, బల్లి.ముత్యాలయ్య తదితరులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజాశక్తి -దొరవారిసత్రం : మాజీ తిరుపతి ఎంపీ, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ బోర్డు మెంబర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, నేటి ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడులు దొరవారిసత్రం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ కుటుంబం అల్లుడు పార్ధసారథి పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్స్ సంచి విజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, నాగయ్య నాయుడు, మాజీ ఎంపిటిసి ఉదయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు వంకా సుధాకర్ యాదవ్, సగిలాల రమణయ్య యాదవ్, బట్ట శ్రీనివాసులు యాదవ్, ముప్పాళ్ళ గోపాల్ రెడ్డి, ఎన్.శేఖర్, ముని రామయ్య, రామయ్య, చిరంజీవి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలో ప్రాంగణ ఎంపికలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు సన్నీ ఒప్పో టెక్ కంపెనీ గురువారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ ఎంపికలు కంపెనీ హెచ్ఆర్ కావ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్, వ్యక్తిత్వ ఇంటర్వ్యూ నిర్వహించి 11 మంది విద్యార్థులను వార్షిక వేతనం రూ.2.88 లక్షలతో ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్లేస్మెంట్ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి తమ కోర్స్ పూర్తి అయ్యేలోపు ఉద్యోగం పొందటానికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కళాశాలలో ప్లేస్మెంట్స్ నిర్వహించడానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి.విష్ణువర్ధన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు హాజరుకండి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికై నిర్వహించనున్న ప్రజా దర్బార్‌లో ప్రజలందరూ పాల్గొని తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని టిడిపి మండల సీనియర్ నాయకులు సన్నారెడ్డి చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 28వ తేదీ శుక్రవారం నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మండలంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారుల సమక్షంలో వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలందరూ తప్పకుండా హాజరు కావాలని సీనియర్ తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు.

చక్రధారి అపార్ట్‌మెంట్ భూమి పూజ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మల గుంట విద్యానగర్‌లో తిరుపతి కూటమి ప్రభుత్వ కార్పొరేటర్ నరసింహాచారి నూతనంగా నిర్మిస్తున్న చక్రధారి అపార్ట్మెంట్ భూమి పూజ కార్యక్రమంలో తుడా చైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని నరసింహాచారి సత్కరించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి నరసింహాచారి నూతన వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,శ్రేయోభిలాషులు, కార్య నిర్వాహకులు పాల్గొన్నారు.

తల్లితండ్రుల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ, ఎంపీపీ పాఠశాల తల్లితండ్రుల కమిటీకి తెలుగుదేశం పార్టీ విధేయురాలు పాశం ఉమా మహేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బాలకృష్ణ మూర్తి సూచన మేరకు వైసీపీ పార్టీ నాయకుల పాచికలు పడనీయకుండా కుమార్, రమణ, రమేష్, నరసింహులు, జగన్నాధంలు పాల్గొని విజయవంతం చేసారు.

5న మెగా పిటిఎం 3.0

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మెగా పిటిఎం 3.0 కార్యక్రమాన్ని డిసెంబర్ 5వ తేదీన తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకేసారి ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన మెగా పిటిఎం 1.0, 2.0 కార్యక్రమాలు తిరుపతి జిల్లాలో విజయవంతంగా ముగిశాయని గుర్తు చేశారు. అదే విధంగా మెగా పిటిఎం 3.0 కార్యక్రమానికి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా లేక మండల అధికారులు హాజరై విద్యార్థుల భవిష్యత్తుపై చర్చించాలని సూచించారు.

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

జంతు మార్కెట్ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య టాటా నరసింగరావు బుధవారం జంతు మార్కెట్ యాప్‌ను ప్రారంభించారు. రైతులు, పశువుల యజమానులు, వ్యాపారులు, గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎస్వీయూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ యాప్‌ను రూపొందించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదివే మచ్చా పూర్ణ ప్రసాద్ ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన ఎస్వీయు పరిశోధక విద్యార్థి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో నెలక్రితం ఒక ప్రొఫెసర్ జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయమని ప్రోత్సహించిన ఘటనపై ఆయనను సస్పెండ్ చేయాలని విద్యార్థులు పోరాడిన విషయం తెలిసిందే. ఆ సంఘటన అనంతరం రెక్టార్ ఛాంబర్‌లో ఏకపక్షంగా విచారణ జరుగుతుండగా అక్కడికి వెళ్లిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై అక్కడి సిబ్బంది దాడి చేసిన సమయంలో ఛాంబర్ తలుపులు అద్దాలు పగిలిపోయాయి. ఈ విషయమవిద్యార్థులపై కేసులు నమోదు చేయడం విద్యార్థుల్లో ఆందోళనకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పరిశోధక విద్యార్థి అశోక్ కుమార్, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ న్యాయ విభాగం మాజీ విద్యార్థి అడ్వకేట్ కప్పెర పవన్ కళ్యాణ్ ద్వారా హైకోర్టును ఆశ్రయిస్తూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా, హైకోర్టు విచారణ సందర్భంగా "ప్రొఫెసరే ర్యాగింగ్ చేయమని ప్రోత్సహించడమేంటి?" అని ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే "విద్యార్థులు ర్యాగింగ్ చేయడం దారుణం" అని వ్యాఖ్యానిస్తూ యూనివర్సిటీ అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా ఏ2 గా ఉన్న పరిశోధక విద్యార్థి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాలలో పనిచేస్తున్న వారిపై వర్సిటీ అధికారులు నిరంతరం అణిచివేతకు దిగుతున్నారని, తోటి విద్యార్థులకు సమస్యలు వస్తే వాటిపై స్పందించడం మా బాధ్యతని, ఇలాంటి అక్రమ కేసులకు మేమెప్పుడూ భయపడమని, ఈ కేసు హైకోర్టులో కొట్టివేయబడుతుందనే పూర్తి నమ్మకం ఉందని, తప్పు చేసిన అధికారులపై హైకోర్టు చర్యలు తీసుకుంటుందని నమ్ముతున్నామని తెలియచేసారు.

కాలువల్లో చెత్త తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో ఎక్కడా మురుగునీరు రోడ్లపైకి రాకుండా కాలువల్లో చెత్త, మట్టి తొలగించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 19వ వార్డు లోని దుర్గానగర్, శేషాద్రి నగర్, పోలీస్ క్వార్టర్స్, జడ్జిల క్వార్టర్స్ లలో కార్పొరేటర్ ఆరని సంధ్య, అధికారులతో కలసి కమిషనర్ తనిఖీ చేశారు. మీ ఇంటికి చెత్త బండి వస్తోందా? కాలువలు శుభ్రం చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని కమిషనర్ కు తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు ఉన్నారు.

స్విమ్స్‌లో పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నాపకాన్ -2025 జాతీయ సదస్సు సందర్భంగా నేషనల్ కాలేజ్ ఆఫ్ చెస్ట్ ఫిజిషియన్స్ (ఎన్సీసీపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల క్విజ్ పోటీని గురువారం స్విమ్స్‌లో నిర్వహించారు. మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో డాక్టర్ కె.ఎం.భార్గవ్, డాక్టర్ ఎం.సి.ఆర్. రామ, డాక్టర్ కిరణ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలలో నారాయణ మెడికల్ కాలేజీ, నెల్లూరు నుండి డాక్టర్ కె.కిరుతిక మొదటి బహుమతి రూ.5,000, రంగరాయ మెడికల్ కాలేజీ, కాకినాడ నుండి డాక్టర్ అరవిందన్ రాజేష్ రెండవ బహుమతి రూ. 2,500 సాధించారు. విజేతలకు స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్లు అరెస్టు



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం) : శేషాచలం అటవీ పరిధి మామండూరు ప్రాంతం వద్ద 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లిభాషా బృందం స్థానిక ఎఫ్బిఓ జాన్ శామ్యూల్‌తో కలసి బుధవారం మామండూరు నుంచి కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున కాకిరేవుల పెంట వద్ద ఇద్దరు వ్యక్తులు కనిపించారని, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో వారిని వెంబడించి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన ఇద్దరూ మాముం డూరు ప్రాంత స్థానికులుగా గుర్తించమన్నారు. వారిని విచారించి పరిసర ప్రాంతాలలో పరిశీలిస్తే 20 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ ఎస్పై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

కుటుంబ కలహాలతో కూలీ ఆత్మహత్య



మృతి చెందిన సుధాకర్

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవీబీ పురం మండలంలోని కాట్రపల్లి గిరిజన కాలనీలో నివసిస్తున్న చెంబెటి సుధాకర్(30) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు ధృవీకరించారు. సుధాకర్‌కు భార్య, చిన్నపిల్లలు ముగ్గురు ఉన్నారని నిత్యం కూలి పనికి పోయి కుటుంబాన్ని పోషించేవాడని స్థానికులు తెలిపారు. కుటుంబ యజమాని చనిపోవడంతో ఆ పిల్లలు అనాధలయ్యారని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక 18 వార్డు, కార్వేటి నగర్ రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం ప్రక్కన కచ్చ కాలువ చిన్న వర్షానికి కూడా నీరు పొంగి రోడ్డుపైకి చేరుతుండటంతో మున్సిపల్ కమిషనర్ డివి నాగేశ్వరరావు కాలువలో పూడిక తీయించారు. అదేవిధంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిపై పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు మొలిచి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాటిని కూడా తొలగించాలని సిబ్బందిని పురమాయించారు. స్థానికులు తమ ఇబ్బందిని గమనించి చర్యలు చేపట్టిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మోహన్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పాల దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత దేశ పాల మనిషిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఇండియన్ డైరీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (ఐడిఎ-ఏపీ) స్థానిక చాప్టర్, కాలేజ్ ఆఫ్ డైరీ టెక్నాలజీ, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, తిరుపతి సంయుక్తంగా తిరుపతిలోని కాలేజ్ ఆఫ్ డైరీ టెక్నాలజీలో బుధవారం జాతీయ పాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికి ఐడిఎ, సిడిటి అధికారులు డాక్టర్ కురియన్ చిత్రపటానికి పుష్ప మాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాలల విద్యార్థులు మరియు తిరుపతిలోని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వాంపల్లిలో మృతి చెందిన టిడిపి కార్యకర్త శివ కుటుంబాన్ని గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరామర్శించారు. శివ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

శిక్షణానంతర సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉచిత శిక్షణ పొందిన వారికి గురువారం సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. తిరుపతిలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ కాలనీలోని మహిళలకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్‌లో ఒక నెల ఉచిత నైపుణ్య శిక్షణ కోసం నవ భారత్ సేవా సమాజ్, సెట్విన్ విభాగం నైపుణ్యం శిక్షణ పొందిన సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా సెట్విన్ విభాగం మేనేజర్ మోహన్ కుమార్, నవ భారత్ సేవా సమాజ్ జనరల్ సెక్రటరీ రహమతుల్లా షరీఫ్, ఎయు బ్యాంక్ తిరుపతి బ్రాంచ్ మేనేజర్ జీవా పాల్గొని సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ సిబ్బంది పద్మ, ఎం.సుమలత, సురేఖ, అలేఖ్య, మౌనిక, నాగమణి, కల్పన, ట్రైనీలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్వీయూ పరిపాలనపై ఉపకులపతి సమీక్ష

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావుతో కలిసి బుధవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఇద్దరూ బోధనేతర సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. వివిధ సెక్షన్ల ఉద్యోగులతో మాట్లాడారు. కొంతమంది సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, వారు తమ పద్ధతిని మార్చుకోవాలని తెలిపారు. ఇలా కొనసాగితే క్రమశిక్షణా చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

విద్యార్థులకు అన్నదానం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయితీ అరిగిల వారిపల్లికి చెందిన దలవాయి మునిరత్నం సంవత్సరీకం సందర్భంగా పనపాకం పేట మోడల్ ప్రాథమిక పాఠశాల, అరిగిలవారిపల్లె, పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు.

భారత రాజ్యాంగం.. దేశ ప్రజల ఆత్మ స్వరూపం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం 'భారత రాజ్యాంగ దినోత్సవం' పురస్కరించుకొని ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రాజ్యాంగ పరిషత్ సభ్యులకు ఘనంగా నివాళులర్పించారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ వెంకటేశ్వర కాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ ఆలయ నిర్మాణానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం భూమి పూజ చేశారు. స్థానికులు తమకు తెలుగు గంగ నీరు సరఫరా చేయాలని, పింఛన్లు, గత ప్రభుత్వ హాయంలో పేదలకు కేటాయించిన పట్టాల స్థానంలో కొత్త పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

108 ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కేవిబి పురం: 108లో విధులు నిర్వహిస్తున్న కేవిబి పురం ఈఎంటి రేవతి అనే ఉద్యోగి ఇటీవల మృతి చెందారు. ఆరోజు వారి కుటుంబానికి మట్టి ఖర్చులకు గాను ఉద్యోగుల సంఘం నుంచి 10000 వేలు, యాజమాన్యం నుంచి 15000 వేల రూపాయలు అందించడం జరిగింది. గురువారం పెద్ద కర్మ సందర్భంగా తిరుపతి జిల్లా ఉద్యోగులు అందరూ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా 66,500 రూపాయలు వారి ఇద్దరి పిల్లల మీద ఫిక్స్ డిపాజిట్ చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం కు 108 రాష్ట్ర అధ్యక్షులు బల్లి కిరణ్ కుమార్, తిరపతి జిల్లా అధ్యక్షులు మహేష్ ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్,జిల్లా కార్యదర్శి మునిరాజా,జిల్లా కోశాధికారి కేశవులు రెడ్డి యాజమాన్యం తరపు నుంచి తిరుపతి జిల్లా డి ఎం సురేష్, డిఎఫ్ఎం రమేష్, ఓఈ శ్రీనివాసులు సహ ఉద్యోగి చంద్రమౌళి హాజరయ్యి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని అందించడం జరిగింది.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

ప్రజాశక్తి -ఏర్పేడు : పచ్చి రొట్ట పంటలతో భూసారాన్ని పెంచుకొని అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని అంజిమేడు, పాత వీరాపురం, ఇసుక తాగాలి గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామకృష్ణారావు, ఏర్పేడు వ్యవసాయాధికారిణి బి. సాగరిక, మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కె. మహేష్ రెడ్డి, రైతు సేవా కేంద్రం వి.ఎ.ఎ. మహేష్ సంయుక్తంగా కలిసి నిర్వహించారు. రైతులకు జీవన ఎరువులపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ఐబీఎమ్ స్కిల్స్ బిల్డ్ శిక్షణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో గురువారం ఐబీఎమ్ స్కిల్స్‌బిల్డ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు కోర్ కాన్సెప్టులు, వాటి అన్వయాలు, సమస్యల పరిష్కారంలో ఏ.ఐ పాత్ర వంటి పలు అంశాలను సమగ్రంగా నిర్వహించారు. శిక్షణ అనంతరం నిర్వహించిన అసెస్‌మెంట్‌ను విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికేషన్ పొందారు. ఈ కార్యక్రమంలో కలశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బడికి వస్తూ మధ్యలో నిలిచిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు కల్లివెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి, దాసులు గురువారం గాంధీ కాలనీ, మొక్కల చేను గిరిజన కాలనీలను సందర్శించి పిల్లలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, తల్లికి వందనం అమౌంట్ తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని, పిల్లలను నిలపకుండా బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - బాలాయపల్లి : పచ్చదనం, పరిశుభ్రత థీమ్ 5 పై విఓఎ లు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నారాయణ సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో విఓఎలకు 2030 నాటికి గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన థీమ్ 5 పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఓఎలు తమ గ్రామాల్లో పరిశుభ్రత పచ్చదనం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి, గ్రామాలు పరిశుభ్రతతో పచ్చదనంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ వినీల్ కుమార్, ఎపియం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పర్యవేక్షణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ గురువారం సందర్శించారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం నారవారిపల్లె క్లస్టర్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌వైఎస్‌ఎస్ అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ నమూనా క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీపీఎం షణ్ముఖం, అదనపు డీపీఎం ప్రతాప్ రెడ్డి, జిల్లా యాంకర్ రవిచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుడా వెంచర్ పరిశీలన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్ ను అధికారులతో కలిసి తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం పరిశీలించారు. తుడా వెంచర్‌లో చేయవలసిన సరిహద్దులను గుర్తించి, రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించారు. వెంచర్‌ను వీలైనంత త్వరగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూసేకరణ అధికారి సుజన, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, డిఈ నరేష్ బాబు, ఎస్ ఈ కృష్ణారెడ్డి, తుడా అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు నివారణే మార్గం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, వ్యాధి నివారణకు జాగ్రత్త తీసుకోవాలని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. సి.టి.ఆర్ నెత్తం గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోవిందపాలెం ప్రైమరీ ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ఆర్.రమేష్ మాట్లాడుతూ అక్రమ సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, తల్లి నుండి శిశువుకి, ఒకరు వాడిన బ్లేడ్లను సిరంజిలను మరొకరు వాడినప్పుడు ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, బాబురావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సరోజ, లక్ష్మీ ప్రసన్న, నాగరాజు, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక పరీక్ష పర్యవేక్షణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బి. ఎన్. కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్థాపక అక్షరాస్యత సంఖ్యాజ్ఞానం ఎఫ్.ఎల్.ఎన్ ప్రాథమిక పరీక్షను ఎంఈఓ -1 రవీంద్రనాథ్, డైయెట్ కళాశాల ఉపన్యాసకురాలు చంద్రకళ పర్యవేక్షించారు. విద్యార్థుల ప్రాథమిక అక్షర సంఖ్యాజ్ఞానం స్థాయిని అంచనా వేయడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షను పాఠశాలలో అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యలో అక్షరాస్యత - సంఖ్యాజ్ఞానం అత్యంత కీలకమని తెలిపారు. డైయెట్ లెక్చరర్ చంద్రకళ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

లింగ వివక్షతను రూపు మాపాలి



ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రతి మహిళా చైతన్యమై మార్పు కోసం ముందడుగుతో మహిళా ఉద్యమంగా లింగ వివక్షతను రూపుమాపాలని ఏపిఎమ్ ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఏర్పేడు మహిళ ఎంఎస్ కార్యాలయంలో గురువారం సీసీలు, గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగు వారాల పాటు లింగ వివక్షతపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జండర్ అసమానతలు, సమస్యలు ఎదుర్కొనే విదంగా మహిళలను చైతన్య పరిచేందుకు నిర్మాణాత్మక వ్యూహాలను సంఘం, గ్రామ సంఘం, మండల మహిళా సమాఖ్యలలో అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా బాల్య వివాహాలు నిర్మూలన, పౌష్టిక ఆహారంపై ఆవశ్యకత గురించి చర్చించారు. సమావేశం అనంతరం ఎంఎస్ కార్యాలయం నుండి ర్యాలీ చేపట్టి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

సకాలంలో బిల్లులు వసూలు చేయండి



ట్రాన్స్‌కో డీఈ చిన్నరెడ్డెప్ప

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా విద్యుత్ బిల్లులను వసూలు చేయాలని ట్రాన్స్‌కో డీఈ చిన్నరెడ్డెప్ప సూచించారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ సబ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, విద్యుత్ బిల్లులు చెల్లింపుపై సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, విద్యుత్ బ్రేక్ డౌన్ కాకుండా చూసుకోవాలని సూచించారు. సర్‌చార్జీతో పాటు అపరాధ రుసుంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించిన బిల్లులను, పంచాయితీ తాగునీటి మోటారు బిల్లులను, వీధిలైట్లు బిల్లులను వసూలు చేయాలన్నారు. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సుధాకర్, ఏఈ చలపతి, లైన్ ఇన్స్పెక్టర్ చెంగల్రాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగత నిధుల సేకరణలో ఏస్ ఇంటర్నేషనల్ ముందంజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అధునాతన న్యూట్రిషన్, డెయిరీ ఇంగ్రెడియెంట్స్ వ్యాపార విస్తరణను వేగవంతం చేయడానికి ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ 35 మిలియన్ అమెరికన్ డాలర్లు (రూ. 305 కోట్లు) నిధులను సమీకరించిందని ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధ్యక్షులు సంజీవ్ గోయల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పెట్టుబడిని నెదర్లాండ్స్ ఆధారిత అభివృద్ధి ఆర్థిక సంస్థ ఎఫ్ఎంఓ, అలాగే రెస్పాన్స్‌ఎబిలిటీ, ఇన్‌కోఫిన్, ఫీడ్లిన్ వెంచర్స్ వంటి గ్లోబల్ ఇన్వెస్టర్లు సమకూర్చారన్నారు. ఈ లావాదేవీకి ఇన్‌వాల్ క్యాపిటల్ ప్రత్యేక సలహాదారుగా వ్యవహరించిందని, ఈ తొలి సంస్థాగత నిధుల సమీకరణ, భారత్ న్యూట్రిషన్‌ను ప్రాసెస్ చేసే విధానం, డెలివర్ చేసే విధానం, వినియోగదారులు అనుభవించే విధానాన్ని కొత్త రూపంలో రూపొందించడానికి ఏస్ చేపట్టిన ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ పరిసరాల్లో వ్యూహాత్మకంగా నిర్మించబడిన కుప్పం కాంప్లెక్స్, బలమైన రవాణా మౌలిక సౌకర్యాలతో మద్దతుగా, 40,000 పైగా రైతులతో వీటిలో మహిళల శాతం కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సమగ్ర సరఫరా భాగస్వామ్యాల ద్వారా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానం గ్రామీణ జీవనోపాధులను మెరుగుపరుస్తూ, సరఫరాలో లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకువస్తుందని చెప్పారు.